# ఎవరో ఒకరు నడవరా ముందుగా

**తా**శీల్దారు ఆఫీసు వరండాలో కల తిరుగుతున్నాడు ముకుందం.

ఆయనకి సమీప పల్లెలో ఒక ఎకరం పొలం వుంది. దాని నానుకుని పంట నీరు రావడానికి నిన్న మొన్నటి దాకా చిన్న బోదె వుండేది. సరిహద్దు రైతు ఆ బోదెని ఆక్రమించి తన చేనులో కలిపేసుకున్నాడు. ఇదేం అన్యాయమని అడిగితే 'నా చేలోంచి నీ పొలానికి నీరిస్తాన్లే' అన్నాడు ఎంతో దయ చూపుతున్నట్టుగా. ఊరి పెద్దలకి చెప్పేడు. అతగాడు మోతుబరి అవడంతో సానుభూతి మాత్రం చూపించారు.

జరిగిందంతా వివరిస్తూ తాశీల్దారుకి పిటీషన్ పెట్టాడు. ఆఘమేఘాల మీద అక్రమాన్ని అరికడతారని బోదెని పునరుద్ధరిస్తారని ఆశించాడు. కాని నెలరోజులు గడిచినా దాని అతీగతీ తెలీలేదు. ఆరా తీస్తే అసలు ఆ ఫైలే దొరకలేదన్నారు. ఇక ఇలా లాభం లేదని స్వయంగా తాశీల్దారుని కలిసి ముఖతః వివరిద్దామని పొద్దుటనగా వచ్చాడు.

ఎందరో లోపలి కెళ్తున్నారు వస్తున్నారు గాని ఆయన్ని మాత్రం వెళ్ళనివ్వలేదు బిళ్ళ బంట్రోతు. అతగాడు చేతులు తడపమని ఒకట్రెండు సార్లు సంజ్ఞ చేశాడు గాని ఈయనకా భాష అర్థం కాలేదు.

కాళ్ళు పీకేస్తున్నాయి. కూర్చోడానికి చిన్నబల్ల కూడా లేదు. ఆవరణలోని చెట్టు కింది కెళ్ళాడు. కూర్చోడానికి అనువుగా లేక మళ్ళీ వరండాలోకి వచ్చాడు.

అసహనంగా చూస్తోంటే ఒకతనొచ్చి "బాత్‌రూం ఎక్కడుందో కొంచెం చెబుతారాండీ" అనడిగాడు అతి మెల్లగా.

"ఆ పక్కనెక్కడో వుంటుంది చూడవయ్యా"

"లేదండి. నా గురించి కాదు మా....."

అతడి చూపుల వెంట చూశాడు. ఒకావిడ సిగ్గుతో చితికిపోతూ చూస్తోంది.

"అరెరె... కనుక్కుంటా నుండు..." గబగబా వెళ్ళి బంట్రోతునడిగాడు.

"అలా వెనక్కెళ్ళయ్యా అంతా బాత్‌రూమే" నవ్వేడు.

"వెనకాల వుందిట..."

"లేదండీ..."

అపనమ్మకంగా చూసి వెనక్కి వెళ్ళి చూశాడు. ముళ్ళ పొదలూ పిచ్చి మొక్కలూ కూలిన గోడలూ కూలబోతున్న షెడ్డూ ఆపైన భరించలేని దుర్గంధం!

నిత్యం ఏవో పనులు నిమిత్తం ఎంతోమంది జనం వచ్చే ప్రభుత్వాఫీసులో మూత్రవిసర్జనకి కనీస సౌకర్యం లేదు. మగాళ్ళైతే ఏ గోడ పక్కకో వెళ్ళిపోగలరు. ఆడవాళ్ళు.....! నిజంగా ఎంత దారుణం! ఎంత హింస!

ముకుందం రక్తం మరిగింది. నారి సారించి వదిలిన బాణంలా తాశీల్దారు గదిలోకి దూసుకెళ్ళాడు.

"ఇంత పెద్ద ఆఫీసు ఆవరణలో ఆడవాళ్ళు ఒంటేలుకు పోయే సౌకర్యం లేదు. అయినా మీకు చీమకుట్టినట్టు లేదంటే ఇంక మీరు జనం బాగోగులేం పట్టించుకుంటారు? చెప్పండి సార్..."

ముకుందం పెద్ద గొంతుతో అరుస్తూ నిలదీసేసరికి తాశీల్దారు దిగ్భ్రమకు లోనయ్యారు. బంట్రోతూ ఉద్యోగులూ వచ్చి ముకుందాన్ని బయటికి లాక్కు పోయారు.

"వదలండయ్యా. ఆ పెద్ద మనిషిని నిలబెట్టి నిలదీయడం పోయి నన్ను బయటికి తోస్తారేంటి?!"

"వెళ్ళెళ్ళు. పొద్దుటే పిచ్చి కుక్క కరిచినట్టుంది..."

కొందరు నవ్వేరు. కొందరు జాలిపడ్డారు.

ఉక్రోషం తన్ను కొచ్చింది "దీని అంతు చూసిగాని వదల్ను..."

పెద్ద పెద్ద అడుగులేస్తూ ఇంటికెళ్ళాడు. ఆయన వాలకం చూసి అదిరిపడింది ఇల్లాలు.

"బీపీ పెరిగినట్టుంది బిళ్ళ తెచ్చివ్వనా?"

ఆవిడ మాటలు విన్పించుకోకుండా "ఇది మనుషులు మసిలే ఊరులా లేదు. అడవిలా వుంది. అరె – అయిన దానికీ కాని దానికీ వేలకి వేలు తగలేస్తారు. జానెడు మరుగుదొడ్డి కట్టించలేరా?" ఒగురుస్తూనే బిగ్గరగా అన్నారు.

బీపీ బిళ్ళ తెచ్చిచ్చింది. మారుమాట్లాడకుండా తీసుకుని వేసుకున్నాడు ముకుందం.

కాగితం కలం అందుకుని జిల్లా కలెక్టరుకి పిటీషన్ రాశాడు. తాశీల్దారు ఆఫీసులో కనీస సౌకర్యాలలేమి గురించీ ప్రజల ఇబ్బందుల గురించీ సవివరంగా రాశాడు. ఉత్తరం పోస్టు చేశాకగాని స్థిమిత పడలేకపోయాడు.

ఈవెనింగ్ వాక్‌కి వెళ్ళి మిత్రులకి జరిగిందంతా పూసగుచ్చినట్టు చెప్పేడు ముకుందం.

"నీ పిచ్చిగాని ఎన్ని కంప్లయింట్లు పంపినా దున్నపోతు మీద వర్షం కురిసినట్టే" అన్నారొకరు.

"మంత్రాలకు చింతకాయలు రాల్తాయేమో గాని పత్రాలకి పనులు కావు" పెదవి విరిచారింకొకరు.

"ఏం జరుగుతుందో మీరే చూద్దురు గాని. చాలా ఘాటుగా రాశాన్లే.." అన్నాడు ముకుందం.

వాళ్ళు చప్పరించేసి వేరే విషయాల్లో కెళ్ళిపోయారు. ఎంతో న్యూనతగా అన్పించింది ముకుందానికి. లోలోపల మండిపోయాడు.

పది రోజులు గడిచాయి. తాశీల్దారు ఆఫీసుకెళ్ళి చూశాడు. పరిస్థితిలో ఎలాంటి మార్పూ లేదు. మరో పదిహేనురోజులు గడిచాయి. కలెక్టర్ నుండి ఎక్నాలెడ్జ్‌మెంటు కూడా రాలేదు.

మళ్ళీ పెన్నూ పేపరూ అందుకున్నాడు.

"మన గొడవలు మనకి చాలవా. ఊరోళ్ళ గొడవలు నెత్తినేసుకుంటారెందుకూ!"

"అదేం మాట. రేపు నాకు అవసరం రావొచ్చు. నీకు రావొచ్చు. ఎదురింటి వాళ్ళకి రావచ్చు. ఎవరైనా సరే నేచురల్ కాల్‌కి అటెండవ్వక తప్పదు కదా!"

"నేలకిపోయేది నెత్తికి రాసుకున్నట్టు గాకపోతే ఎవరికీ పట్టంది మీకెందుకూ!"

"అంతా అలా అనుకుంటే ఎలాగే. ఎవరో ఒకరు పిల్లి మెడలో గంటకట్టాలిగా! అన్యాయాన్నీ అవినీతినీ సహించడమంటే సమర్థించడమే అవుతుంది. చూసీ చూడనట్టూరు కోవడమంటే ఆత్మద్రోహమే అవుతుంది..."

"మీదంతా చాదస్తం!" చిన్నగా విసుక్కుందావిడ.

స్థానిక యమ్మెల్యేకీ మంత్రికీ మొత్తం వృత్తాంతాన్నంతా వివరిస్తూ రిజిస్టర్డ్ పోస్టులో ఫిర్యాదు పంపించాడు.

రోజూ పోస్టుమేన్ కోసం ఎదురు చూస్తోంటే ఎట్టకేలకో ఉత్తరం తెచ్చిచ్చాడు.

మంత్రిగారి పేషీ నుంచి వచ్చిందది. మీ ఫిర్యాదు మీద వెంటనే చర్య తీసుకోమని సంబంధిత అధికారుల్ని ఆదేశించడమైనదంటూ అందులో పేర్కొన్నారు.

ఏనుగెక్కినంత సంబరపడ్డాడు ముకుందం.

"నాదంతా వృథా ప్రయాస అన్నారుగా. చూడండి ఇప్పుడేమైందో. మంత్రి గారు ఆర్డర్స్ ఇచ్చేశారు. ఈ దెబ్బకి ఆ ఆఫీసు ఫేసు మారిపోతుంది" అన్నాడు భార్యతో గర్వానందంతో ఊగిపోతూ.

ఆవిడ ఆనందిస్తూ చూసింది. అదే మాట మిత్రులకు చెప్పాడు. వాళ్ళు అదో జోక్ అయినట్టు నవ్వేరు.

"అవన్నీ రొటీన్ లెటర్లు!" అన్నారు.

"మీరలా తీసిపారెయ్యడం ఏం బావోలేదు. మంత్రి అంటే ప్రభుత్వ యంత్రాంగంలోని కీలకవ్యక్తి. ఓ ప్రభుత్వశాఖకి అధిపతి. ఆయన ఉత్తర్వులకు పళ్ళూ పసా ఉండవంటే ఎలా!" అన్నాడు. వాళ్ళు చేయలేనిది తను చేసినందుకు అసూయతో మాట్లాడుతున్నారేమోలే అనీ అనుకున్నాడు.

వారి అభిప్రాయాలు తప్పు అని నిరూపించాలన్న తపన రెట్టింపయ్యింది.

రోజూ తాశీల్దారు ఆఫీసు కెళ్ళి పరిశీలించడం, ఆ వెంటనే నిట్టూర్చడం దినచర్య అయిపోయింది. ఈ గొడవలో పడి తన పొలం సరిహద్దు గొడవ పక్కన పెట్టేశాడు. ఈ చిన్న పనే చెయ్యకపోతే ఇంకదెక్కడ చేస్తారన్న భావన ఆయన్లో బలంగా నాటుకుపోయింది.

యథా ప్రకారం తాశీల్దారు ఆఫీసుకెళ్ళి నీరసంగా తిరగి వస్తోంటే సంగతేవిటంటూ పలకరించాడు తెలిసిన కుర్ర ప్లీడరు.

విషయమంతా ఏకరువు పెట్టాడు ముకుందం.

సమాచార హక్కు చట్టం గురించి చెప్పి "ఒక పిటీషన్ తగిలిస్తే సరి పైనుంచి కింది దాకా కదిలి వచ్చేస్తుంది" అన్నాడు.

"ఎలాంటి సమాచారం అడిగినా ఇస్తారా?" తన అజ్ఞానానికి ఆశ్చర్యపోతూనే అడిగాడు.

"చచ్చినట్టు ఇస్తారు. సరిగ్గా ఉపయోగించుకుంటే పాశుపతాస్త్రమే. తీగ లాగితే డొంకే కాదు వేళ్ళు కూడా కదుల్తాయి" అన్నాడు ప్లీడరు.

జ్ఞానోదయమైనట్టుగా అన్పించింది. హఠాత్తుగా తానెంతో బలవంతుడైనట్టుగా అనుభూతి చెందాడు.

అతడి వంక ప్రశంసాపూర్వకంగా చూశాడు ముకుందం.

గత పదేళ్ళలో తాశీల్దారు కార్యాలయం దగ్గర ప్రజల సౌకర్యార్థం ఏమేం చేశారో దేనికెంత ఖర్చు పెట్టారో ఆ వివరాలూ తబ్సీళ్ళూ తెలియ పర్చాల్సిందంటూ ఆర్టీఐ యాక్ట్ క్రింద దరఖాస్తు చేశాడు.

జవాబు రాలేదు. రిమైండర్ పంపేడు.

"రికార్డులు లభించనందున సమాచారం ఇవ్వలేకపోతున్నందుకు చింతిస్తున్నాం" అని జవాబొచ్చింది.

అది పట్టుకుని కుర్ర ప్లీడర్ని కలిశాడు ముకుందం. అతడి సలహా ప్రకారం పై అధికారికి అప్పీలు చేశాడు.

మరి నాలుగు రోజులు గడవకుండానే తాశీల్దారు ఆఫీసు నుండి ఓ సీనియర్ అసిస్టెంటు ముకుందాన్ని వెదుక్కుంటూ వచ్చాడు.

"మీరేదో ఇన్ఫర్మేషన్ అడిగారు కదా. అదెందుకు? దానివల్ల మీకేం ఉపయోగం?"

"సమాధానం వచ్చాక చెబుతాను"

"ఇతర్ల గొడవ వదిలి మీకు పనికొచ్చే సంగతి చూసుకోవడం తెలివైనపని. ఆ మధ్య మీ పొలంపక్క బోదెని కబ్జా చేశారని తిరిగారు కదా. దాన్ని సరిచేయిస్తానని తాశిల్దారుగారు చెప్పమన్నారు....."

ఇంతింత కళ్ళతో చూశాడు ముకుందం. "నా దరఖాస్తు దొరకలేదన్నారుగా!" అన్నాడు.

"తర్వాత దొరికిందిలెండి. మీకు న్యాయం చెయ్యమని నేను కూడా గట్టిగా చెబుతాను. తాశిల్దారు గారిది దొడ్డ మనస్సు. తప్పకుండా చేస్తారు. మీకు తెలుసుగా అవతలి పార్టీ మోతుబరి. అయినా సరే లెక్క చెయ్యరు. నాదీ హామీ!"

"సంతోషం. కాని ఇది వదులుకోను"

"మీది తిక్కో పిచ్చో తెలీడం లేదు. ఆఫీసుల్లో పైకి చెప్పుకోలేనివి సవాలక్ష వ్యవహారాలుంటాయి. క్రింది నుంచి పైదాకా లింకులుంటాయి. అవన్నీ మీకెందుకు చెప్పండి. నా మాట విని 'నా కడుపే నాకు కైలాసం' అనుకోండి. అంతా హ్యాపీయే"

"అనుకోను. మీరిక వెళ్ళొచ్చు..."

అతడు కోపంగా చూశాడు. "మీరడిగిన పన్నీ ఇవ్వాలంటే జీరాక్సులకీ స్టాంపులకీ చాలా ఖర్చవుతుంది తెలుసా?"

"ఎంతైనా భరిస్తాను"

విసురుగా వెళ్ళి పోయాడతడు.

'వేడి పుట్టిందన్నమాట' మనసులో సంబరంగా అనుకున్నాడు ముకుందం. కానెవరికీ చెప్పదలచలేదు. వ్యంగ్యోక్తులు వినదలచుకోలేదు.

తాశీల్దారు కార్యాలయం వారు ముకుందం కోరిన సమాచారాన్నంతా అందజేశారు.

అదంతా విశ్లేషించడానికి పూర్తిగా ఒక రాత్రి పట్టిందాయనకి.

అందులోంచి బయటపడ్డ నిజాలు చూసి విభ్రాంతుడయ్యాడు.

కార్యాలయ పనుల నిమిత్తం ఆఫీసు కొచ్చే ప్రజల సౌకర్యార్థం త్రాగు నీరు అందించడానికీ బాత్‌రూంలు నిర్వహించడానికీ 'రాయల్ పీపుల్' అనే సంస్థకి యాన్యువల్ కాంట్రాక్టు ఇచ్చార్ట. ఏడాదికి రెండు లక్షలు చొప్పున నిర్వహణ ఖర్చులు చెల్లిస్తున్నారట. ప్రజలు కూర్చోడానికీ ఎండా వానల నుంచి రక్షింపబడటానికీ చక్కని కుర్చీలూ షెల్టర్లూ ఏర్పాటు చేశార్ట. అందుకోసం ఏడాదికి యాభైవేల చొప్పున వెచ్చించార్ట!

చిత్రమేమింటంటే తన ఫిర్యాదుకి మంత్రిగార్నుంచి రిప్లై వచ్చేక అత్యవసర సౌకర్యాలకల్పనకంటూ లక్షాపాతిక వేలు ఖర్చు పెట్టారు! అంటే మంత్రిగారు తగిన చర్యలు తీసుకోమనగానే దాన్ని 'క్యాష్' చేసేసుకున్నారు. కాగితాల మీద 'చర్యలు' తీసేసుకున్నారన్నమాట!

ఈ ఒక్క ఆఫీసులోనే ఇంత ప్రజాధనం దుర్వినియోగమవుతోంటే ఇక అన్ని ఆఫీసుల్లో కలిపి జిల్లా మొత్తం మీద ఎంత అవుతోందో! రాష్ట్రంలో ఇంకెంత ఎంత అవుతోందో!

గుండె గుభిల్లుమంది.

తాగునీటి ఏర్పాట్లకి సైతం ఫండ్స్ లేవంటారు. ఇలా లక్షలూ కోట్లూ వృథా చేస్తారు. తమ జేబులు నింపుకుంటారు. అవి పట్టకపోతే స్విస్ బ్యాంకుల్లో దాచుకుంటారు!

'దీన్ని ఇంకా సాగనివ్వకూడదు. అడ్డుకట్ట వేసి తీరాల్సిందే' అనుకున్నాడు దృఢ

చిత్తంతో.

మరుసటి రోజు ఉదయమే వార్డు కౌన్సిలర్ తన అనుచరుల్తో కలిసి ఇంటి మీద కొచ్చాడు. ఊహించని పరిణామానికి నుదురు ముడి వేసి చూశాడు ముకుందం.

"ఒరె ఒరె ఏం చెయ్యకండొరేయ్. ఏవీ బద్దలు గొట్టొద్దు. దేని మీదా చెయ్యి వెయ్యొద్దు. మన సారు మంచోడు. చెప్పిన మాట వింటాడు" తన అనుచరుల్తో చెప్పి నవ్వుతూ ఇంట్లో కొచ్చాడు.

కుర్చీ చూపించాడు ముకుందం. తలుపు చాటు నుంచి భయం భయంగా చూడసాగింది ఇల్లాలు.

"చాలా సార్లు ఇటుపోయాను గాని నిన్ను చూళ్ళేదు. ఏమైనా పనుంటే చెప్పు చేయించేస్తాను. చైర్మన్ మనోడే"

తలూపాడు ముకుందం.

"నువ్వు మంచోడివి. మంచిగా ఉండు చాలు. ఎవరెలా పోతే మనకేంటి చెప్పు. మనం బావుండాలి. మనిల్లు బావుండాలి. తెల్సిందిగా?..... ఇక నడండ్రా. సారుకి అర్థమైందిలే, పదండి..." అంటూ లేచి మెట్లు దిగబోతూ ఆగాడు.

"నీ పొలం పని సరిచేసి పెట్టలేదని తాశీల్దారు మీద కోపం ఉంటుంది. కాదనను. తాశీల్దారుకి చిరాకెక్కువ అన్నమాటేగాని పాపం మంచోడే. పిల్లలు గలవాడు. వదిలెయ్. నీ పని చేసిపెడతాళ్ళే గాని ఇంకే పనీ పెట్టుకోకు. బావుండదు. ఆ కాగితాలు పొయ్యిలో వేసి తగలెట్టెయ్. ఆ గొడవలు నలుగురికీ తెలిస్తే నీకే ప్రమాదం... కాటికి కాళ్ళు చాచుకున్న ముసలోళ్ళు కాలు దువ్వకూడదు. ముందడుగూ వేయకూడదు. కృష్ణా రామా అనుకుంటూ ఓ మూలన కూర్చోవాలి...!" అన్నాడు కౌన్సిలర్ అదోలా నవ్వుతూ.

ముకుందం మాట్లాడలేదు.

అతగాడు నవ్వుతూ వెళ్ళిపోయాడు. అనుచరులు ముకుందం వంక కోపదృక్కులు చూసి అనుసరించారు.

"మిడతలదండొచ్చి పడిందేవిటండీ!" ఆదుర్దాగా అడిగింది భార్య.

"భయపెట్టడానికి!"

"ఎవర్ని?"

జవాబివ్వకుండా తిన్నగా ఓ దినపత్రిక స్థానిక విలేఖరి ఇంటికెళ్ళాడు

ముకుందం.

తనకందిన సమాచారాన్నంతా అతడికి చూపించాడు. అతడు పరమానందభరితుడై అయన్ని ఆకాశానికెత్తేశాడు.

"ఫోర్త్ ఎస్టేట్ చెయ్యాల్సిన పని మీరు చేశారు. ఇలా పౌరులంతా బాధ్యతగా వ్యవహరిస్తే మనదేశం సూపర్ పవర్ కాదు దాని అమ్మాబాబవుతుంది" అన్నాడు ఉద్విగ్నుడై.

ఆ వెంటనే కెమేరా తీసుకునెళ్ళి తాశీల్దారు ఆఫీసునీ పరిసరాల్నీ చకచకా ఫోటోలు తీశాడు. అద్దె భవనంలో ఉంటోన్న తాశీల్దారు ఆఫీసు గురించీ కూపీ లాగాడు. పదివేలకి మించి పైసా అద్దె చెల్లించక్కర్లేని ఆ భవనానికి నలభైవేలు చెల్లిస్తున్నట్టు తెలిసింది. సదరు భవనం యమ్మెల్యే బావమరిదిదనీ తెలిసింది.

వెంటనే అగ్గిగీశాడు. వార్త ఆటంబాంబులా పేలింది.

ముకుందం మిత్రుల్తో బాటు టౌన్లోని చాలామంది – ముఖ్యంగా యువకులొచ్చి అయన్ని అభినందనలతో ముంచెత్తారు.

ఆయనేమీ పొంగిపోలేదు. ఇది మొదటి అడుగు మాత్రమేననీ నడవాల్సిన దూరం చాలా వుందనీ అనుకున్నాడు.

'రాయల్ పీపుల్' సంస్థకి జిల్లాలోని వివిధ ప్రభుత్వ సంస్థలు ఇచ్చిన కాంట్రాక్టుల వివరాలు కావాలంటూ సమాచార హక్కు చట్ట ప్రకారం మరో దరఖాస్తు దాఖలు చేశాడు ముకుందం.

సంవత్సరానికి నాలుగున్నర కోట్ల పనులు పురమాయిస్తున్నట్టు సమాచారం అందింది.

ఆ సంగతి పత్రికకెక్కడం ఆలస్యం ఓ న్యూస్ ఛానల్ మరో అడుగు ముందుకేసి సదరు సంస్థకీ ఓ మంత్రికీ గల సంబంధాన్ని బయట పెట్టింది.

అంతేకాదు ఆ సంస్థ పేరున చేసినవన్నీ బోగస్ పనులేననీ ఏమీ చెయ్యకుండానే చేసినట్టు బిల్లులు సృష్టించి అధికార్లతో కుమ్మక్కై ప్రభుత్వ ఖజానా నుంచి కోట్లు కొట్టేశారని పేర్కొంది.

ఆ వార్త ప్రతిపక్షం చేతిలో ఆయుధంగా మారి అసెంబ్లీని కుదిపేసింది.

ఆ స్ఫూర్తితో రాష్ట్రం నలుమూలలా ఎందరెందరో సామాజిక కార్యకర్తలు రైట్

టు ఇన్ఫర్మేషన్ చట్ట ప్రకారం ఎన్నో రకాల సమాచారసేకరణకు దరఖాస్తుల అస్త్రాలు సంధించారు.

శాంతియుత ప్రజాగ్రహానికి అటు ప్రభుత్వమూ ఇటు అధికారులూ ఉక్కిరిబిక్కిరవ్వసాగారు.

* * *

ముకుందం ఇంటికి దగ్గర్లో ఒక కొత్త భవనం నిర్మితమవుతోంది. టౌన్ ప్లానింగ్ అధికారులొచ్చి చకచకా కొలతలేశారు.

చోద్యం చూస్తూ నిలబడ్డాడు ఇంటి యజమాని.

"ప్లాన్ ప్రకారం సెట్‌బ్యాక్‌లు వదల్లేదు. వచ్చి ఆఫీసర్‌గార్ని కలువు లేదా సగం బిల్డింగ్ పడగొట్టేస్తాం"

"నేను చేసింది తప్పే. అందుకు పెనాల్టీ కట్టి బిల్డింగ్ రెగ్యులైజేషన్ స్కీం కింద అప్లై చేస్తాను తప్ప లంచం ఇవ్వను"

"నువ్వెక్కడో మూర్ఖుడిలా వున్నావు. ఐదు వేలతో పోయేదానికి పదివేలు తగలేస్తానంటావేంటి?"

"పోనీలెండి. ఆ సొమ్ము ప్రభుత్వ ఖజానాకి చేరుతుంది కదా. మన టౌన్లో ఈ ఏడాది వేలాది నిర్మాణాలకి మీరు అనుమతిచ్చారు కదా. వాటిల్లో ఎన్ని ఆమోదించిన ప్లాన్ ప్రకారం కట్టారు? ఎన్నిట్లలో అతిక్రమించారు? అతిక్రమించిన కేసుల్లో ఎన్నిట్లలో మీరు చట్టప్రకారం చర్య తీసుకున్నారు? మిగతా వాటిని ఎందుకు ఉపేక్షించి వదిలేశారు? అసలలా వదిలేసిన వాటిల్లో ఎన్నింటికి బిల్డింగ్ రెగ్యులేషన్ చేసుకోమని నోటీసులిచ్చారు? అలా జరగడానికి బాధ్యులైన ప్రభుత్వోద్యోగుల మీద ఏం చర్యలు తీసుకున్నారు? ఈ సమాచారమంతా నాక్కావాలి. ఎవరికి దరఖాస్తు చేసుకోవాలో కొంచెం చెబుతారా?"

సదరు మున్సిపల్ అధికారుల నోరు పడిపోయింది!

* * *

ప్రజల దగ్గర్నుంచి రకరకాల పన్నుల రూపేణ వసూలు చేస్తున్న ప్రతిపైసా వినియోగానికి ప్రజాప్రతినిధులూ ప్రభుత్వోద్యోగులూ జవాబు దారి అవ్వాలి. దుర్వినియోగమైన ప్రతి రూపాయినీ సదరు బాధ్యుల్నుంచి వసూలు చేసే బాధ్యతని ప్రభుత్వం స్వీకరించాలి. అలా ఆదేశిస్తూ ఉత్తర్వులిమ్మని అర్థిస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజనాల

వ్యాజ్యం దాఖలు చేశాడు ముకుందం.

అంతటితో చేతులు ముడుచుక్కూర్చోనివ్వ లేదాయన అంతరాత్మ.

ఢిల్లీలో అవినీతికి వ్యతిరేకంగా శంఖం పూరించిన అన్నా హజారే స్ఫూర్తితో మరింత చైతన్యం పొందాడు ముకుందం.

అన్నా పోరాటానికి మద్దతుగా టౌన్లోని యువకుల్ని కూడ గట్టి రిలే నిరాహారదీక్షకు కూర్చున్నాడు. ఆయన్తో బాటు ఇరవై మంది యువతీ యువకులు చేతులు కలిపారు. ఎందరో జనం సంఘీభావం తెలిపారు.

చిన్న చిన్న చినుకులు ఏకమవుతున్నాయి. ప్రభంజనంలా మారుతున్నాయి. అవినీతి రహిత సమాజాన్ని ఆవిష్కరింపబోతున్నాయి! భావిభారత స్వరూపాన్ని సమూలంగా మార్చబోతున్నాయి!

వ్యష్టి కాదు సమిష్టి శక్తి అయిన అన్నాజీ జయహో! మాన్యుడా మహర్షీ జయ జయ జయహో !

(స్వాతి మాసపత్రిక ఏప్రిల్ 2012)